బుజ్జమ్మ అదృష్టం

"అవళ్‌పారుంగ... అపకుమారి మాదిరియే ఇరిక్కా..."

"నీంగ సరియా సొల్లిర్కింగ... అచ్చం కుమారిలాగే వుంది"

ఇలా మాట్లాడుకుంటున్న వాళ్లిద్దరూ ఎంతో దూరంలో లేరు. కేవలం పది పదిహేను గజాల దూరంలో నిలబడి వుండి తనవంకనే కళ్లార్పకుండా చూస్తూ మాట్లాడుకుంటూ వుంటే బుజ్జమ్మకు గుండెలు దడదడలాడుతున్నాయి.

గోడకానుకుని ఒదిగి ఒదిగి బిక్కు బిక్కుమంటూ కూర్చునివుంది. వాళ్లిద్దరూ తనను గురించే మాట్లాడుకుంటున్నారని మాత్రం స్పష్టంగా తెలుస్తున్నది. ఇద్దరూ వయసు మళ్లినవాళ్లేమీ కాదూ పాతిక యేళ్లకు మించివుండవు. ఆధునికంగా దుస్తులు ధరించి డాబుసరిగా వున్నారు.

రాత్రి పొద్దుపోయినట్టే లెక్క. తాము నలుగురూ పినాకినిలో దిగారు. అప్పటికే ఆ బండి ఆలస్యంగా తొమ్మిది గంటలు దాటుతుండగా వచ్చింది. రైలులోనే డబ్బుల పంపిణీ జరిగిపోయింది. ఉదయం బెడవాడ నుంచి బయలుదేరి ఒంగోల్లో మొదలుపెట్టి రైలు పెట్టెలు ఊడ్చి శుభ్రంచేసి దయగల తండ్రులూ దయగల తల్లులూ ఇచ్చిన చిల్లర నలుగురూ సమంగా పంచుకుని మరీ ప్లాట్‌ఫారం మీద దిగారు. రైలు దిగీ దిగగానే నిప్పుకోడిగాడు తెచ్చిపెట్టాడు సమస్య.

"పోదామా?" అన్నాడు ముందు.

చింపిరిగాడు తల విసురుతూ "పదండి పోదాం" అని వంతపలికాడు.

వాళ్లిద్దరికంటె కొంచెం చిన్నవాడు కదా, కోటిగాడికయినా వుండాలి బుద్ధి... కానీ, వాడు కూడా పై ఇద్దరితో కలిశాడు. "పోదాం.. తొరగా పదండి" అన్నాడు.

బుజ్జమ్మ తెల్లబోతూ "ఎక్కడికి?" అని అడిగింది.

"మేము ఇప్పుడు సినిమాకు పోతున్నాం... రెండో ఆటకి... ఇంగ్లీషు... ఇవాళ ఆఖరు రోజు... రేపు ఉండదు. చాలారోజుల నుంచి చూడాలని ప్లాను..." అన్నాడు నిప్పు కోడిగాడు.

కోటిగాడు "అవునవును" అన్నాడు.

వాడి బుర్రలో తానొకానొక రోజు పోలీసు దెబ్బతిని పారిపోయినవాడు చూసిన సినిమా హాలు... హాలు ముందున్న బొమ్మలు... ఇంకా చెరిగిపోలేదు. ఊరిస్తూనే వున్నాయి.

బుజ్జమ్మ చిరాకుపడింది. 'వీళ్ల వరస చూస్తే చాలా ముందునుంచే వ్యూహం పన్నినట్టున్నారు' అనుకుంది.

"నన్నొంటిరిగా వొదిలేసి మీరందరూ పోతారా?" అని జాలిగా నసిగింది.

"నువ్వూ రా" అన్నాడు చింపిరిగాడు.

"నే(నాను... మీరుకూడా మానేయండి" అన్నది బుజ్జమ్మ మొండిగా.

వాళ్లూ మొండికేశారు. "వెళ్లాల్సిందే" అన్నారు.

"నువ్వు వొస్తేరా. లేపోతే మానెయ్" అనికూడా అన్నారు. తర్వాత "నువ్వు ఎక్కడికీ కదలకు. ఇక్కడే పడుకో. ఏం భయంలేదు" అనికూడా చెప్పారు. అన్నీ చెప్పి హడావిడిగా వెళ్లిపోయారు.

బుజ్జమ్మ ముందు తన డబ్బు లెక్కచూసుకుంది. ఇవాళ్టి సంపాదనలో తనవంతు నాలుగున్నర రూపాయలు... అన్నీ పావలా బిళ్లలూ, పదిపైసల బిళ్లలూ... వాటిని తన గుడ్డసంచిలో ఉంచుకుని భద్రంగా బొడ్లో దోపుకుంది. తర్వాత గోడకానుకుని కూర్చుని ఆవులించి నిద్రపోదామని ప్రయత్నించింది. అదుగో, సరిగా అప్పుడు మొదలైంది ఈ బాధ...

వాళ్లిద్దరూ ఇంకా అలాగే నిలబడి చాలా సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు గొంతు తగ్గించి మాట్లాడుకుంటున్నారు. గుసగుసలుపోతున్నారు. తర్కించుకుంటున్నారు.

బుజ్జమ్మ 'లేచి ఎటైనా పారిపోదామా' అనుకుంది ముందు. కానీ అలా చేయలేదు. పారిపోవడం పిరికితనం అనుకుంది. ఏది ఏమయినా ఇంత పెద్ద స్టేషనులో తనకు ఎదురుకాగల ప్రమాదమేమీ లేదనుకుంది. బాగా పొద్దుపోయినందువల్లను, రైళ్లరాకపోకల మధ్య వ్యవధి ఉన్నందువల్లను, తాను కూర్చుని వున్నచోటు దూరంగా ఉన్నందువల్లను భయంగా ఉంది తప్ప అంతగా తనకు సంభవించగల ఉపద్రవం ఏదీలేదు. వాళ్లిద్దరూ ఏదైనా కానిపనికి పూనుకుంటే అప్పుడు ఉన్నట్టుండి జింకలాగా లేచి పరుగెత్తితే ఇక అంతా జనసమర్దమే...

ఇద్దరు టీసీలు నిరంతరం ఉంటారు. జనం హడావిడి, లైట్ల వెలుతురు... అంతా పట్టపగలులాగే ఉంటుంది ఎప్పుడూ. తనకేమీ ప్రమాదంలేదు.

అయితే వాళ్లు హఠాత్తుగా మీదపడి ఏ మందోమాకో వాసన చూపించి తనను స్పృహతప్పేట్టు చేస్తే మాత్రం ప్రమాదమే.

ఈ మధ్య ఆడపిల్లల్ని... ఆమాట కొస్తే మగపిల్లల్ని కూడా... అపహరించుకుపోయి ఎక్కడో అమ్మివేసే దుర్మార్గపు ముఠాలు తిరుగుతున్నాయట. 'ఎందుకైనా మంచిది. కొంచెం జాగ్రత్తగా ఉందాం' అనుకుంది.

కొంతసేపటి తర్వాత వాళ్లిద్దరూ ఏమనుకున్నారో ఏమో, ఏకాభిప్రాయానికి వచ్చినవారిలా బుజ్జమ్మ వైపు రావడం ప్రారంభించారు.

నెమ్మదిగా అడుగులు వేస్తున్నారు.

బుజ్జమ్మ భయంతో ముదుచుకుపోయింది. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఉన్నట్టుండి శివమెత్తినదానిలా "ఏమిటి? ఏమిటి? ఎవరు మీరు?" అని గావుకేకలు పెట్టింది.

వాళ్లేదో చెప్పబోయారు. కానీ బుజ్జమ్మ వాళ్లను మాట్లాడనివ్వకుండా తానే పిచ్చిగా పెద్దగా అరిచింది.

దాంతో వాళ్లిద్దరూ ఏమనుకున్నారో ఏమో హడావిడిగా వెనుదిరిగి వెళ్లిపోయారు.

బుజ్జమ్మ మనసు కుదుటపడింది. 'హమ్మయ్య' అనుకున్నది. తాను పెద్దగా అరిచి గోలచెయ్యడంవల్ల మంచి జరిగింది. లేకపోతే వాళ్లు ఏ అఘాయిత్యం తలపెట్టేవాళ్లో అనుకుంది.

నెమ్మదిగా కాళ్లు జాపుకున్నది. గోడకానుకుని పడుకుంది. తర్వాత ఆవులించింది – గోడపక్కన దోమలు జుమ్మని ముసురుతున్నాయి. లోపల ఆలోచనలు... 'గాడిద వెధవలు' అనుకున్నది సహచరులు ముగ్గురినీ గురించీ...

రైలు పెట్టెల్లో చెత్తాచెదారమూ రెక్కలు ముక్కలు చేసుకుని ఊడ్చి అందర్నీ అడుక్కుని డబ్బు సంపాయిస్తామా, దాన్ని వెంటవెంటనే ఊదేస్తారు. దాచుకుందామని బుద్ధిలేదు.

మొన్నటికి మొన్న నిప్పుతోడిగాడికి ఆ మాష్టారెవరో వంద రూపాయిలిచ్చిపోయాడు. వందరూపాయిలంటే సామాన్యమా? ఏం లాభం? ఈ వెధవలు ముగ్గురూ చేరి జమిలిగా అంత డబ్బునూ వారం రోజుల్లో తగలేశారు. ఎక్కడబడితే అక్కడ పచ్చిమిరకాయ బజ్జీలు, మిక్చర్‌లు, అయిస్‌ఫ్రూటులూ మెక్కితే ఎన్నాళ్లుంటుంది డబ్బు?'

బుజ్జమ్మ నిట్టూర్చింది. తనకెవరూలేరు. నేలమీద పడింది మొదలు తల్లెవరో తండ్రెవరో తెలియకుండా ఈ రైల్వే ప్లాట్‌ఫారమ్మీదే బతికింది.

ఒక ముసలి రైల్వేకూలీ ఉండేవాడు. అతని పేరు రాజన్న. రెండేళ్ల క్రితమే పోయాడు.

అతడు అంటూ ఉండేవాడు. "ఈ పిల్ల ఉందే, దీనికి బుజ్జమ్మ అని నేనే పేరు పెట్టాను. దీన్ని నెలల వయసులో రైల్లో వదిలేసిపోయారెవరో. ఏడుస్తూ వుంటే నేనే చూసి వాకబుచేసి ఎవరూ దొరక్క చివరకు రైల్వే పోలీసులకు అప్పజెప్పాను. దయగలవారు కాసిని పాలుపట్టి కనిపెట్టి చూశారు. అట్లా దీనికి నడక వచ్చేదాకా చూసి తర్వాత వాళ్లూ గాలికి వొదిలేశారు. ఇదుగో తర్వాత ఇది ఇట్లా ఆ దిక్కులేని వెధవలతో కలిసి రైలు పెట్టెలు ఊడుస్తూ ప్రయాణీకులను అడుక్కుంటూ సొతంత్రంగా బతుకుతున్నది."

బుజ్జమ్మ ఇవాళ పగలంతా రైల్లో ఒకచోటనే స్థిరపడిపోయింది. చాలాసేపు మద్రాసు నుంచి విజయవాడ వచ్చేదాకా ఒకేచోట పీఠం వేసుకున్నట్టు కూర్చుండిపోయింది.

ఒక కుటుంబం... భార్యాభర్తలు మహాఅందంగా దేవతల్లా ఉన్నారు. పచ్చని ఛాయ ఇద్దరిదీని. ఇద్దరు పిల్లలు. పెద్దవాడు మూడేళ్లవాడేమో, గాలికొట్టిన బెలూనులాగున్నాడు. చిన్నపిల్ల బంగారు బొమ్మలాగున్నది. వాళ్ల అచ్చట్లు ముచ్చట్లు చూడ్డానికి బుజ్జమ్మకు రెండు కళ్లూ చాలలేదు. పైగా కింద చెత్తా చెదారం అంతా ఊడ్చి చేయి జాపితే ఆయన రూపాయి నోటు ఇచ్చాడు.

ఇప్పుడు బుజ్జమ్మ కళ్లవెంట అనవసరంగా నీళ్లు ఉబికి వచ్చాయి. చేయి వెనక్కి తిప్పుకుని రెండుకళ్లూ గట్టిగా తుడుచుకుంది.

ఎంతసేపయిందో... పక్కనే సవ్వడి...

హఠాత్తుగా లేచి కూర్చుంది. ఎదురుగా నల్లకోటు ధరించి టీ.సీ.గారు... పక్కనే తనను గురించి ఇందాక మాట్లాడుకున్న ఇద్దరు మనుషులూ... బుజ్జమ్మ లేచి నిలబడి తెల్లని పళ్లు బైటపడేలా నవ్వింది.

టీ.సీ. గారు మధ్యవయస్కుడు. బెజవాడలోనే చాలాకాలంనుంచీ ఉంటున్నాడు. ప్లాట్‌ఫారమే ఇల్లుగా బ్రతికే ఈ నలుగురు అనాథలను గురించి తెలిసినవాడు. వాళ్లు రైలెక్కి ఎటెటో పోయి పెట్టెలు ఊడ్చి శుభ్రంచేసి ప్రయాణీకులను అడుక్కుని తమనుతాము పోషించుకుంటున్నారని సానుభూతి కలవాడు.

ఆయన నవ్వుతూ నెమ్మదిగా "బుజ్జమ్మా" అని అనునయంగా పలకరించాడు.

"వీళ్లిద్దర్నీ చూసి ఇందాక నువ్వు భయపడ్డావట. పెద్దగా అరిచి గోలపెట్టి తరిమేశావుట. ఇదుగో ఈ అబ్బాయీ మా అన్నకొడుకే. అయితే ఎప్పుడూ మద్రాసులోనే ఉంటాడు. సినిమాలు తీస్తూ ఉంటాడు"

ఆయన ఆగాడు.

అంతలో నిప్పుకోడిగాడు, ఆ వెనకనే చింపిరీ, పక్కన కోటిగాడు కూడా వచ్చి నిలబడ్డారు.

"ఏంలేదమ్మాయ్! వీళ్ళకు నీతో పనిపడింది. ఊరికే భయపడకు. నెమ్మదిగా విను"

బుజ్జమ్మ బిక్కు బిక్కుమంటూ నిలబడింది.

టీ.సీ.గారు తాపీగా చెప్పాడు-"ఏంలేదు... వీళ్లొక సినిమా తీస్తున్నారు. ఈ దగ్గరలోనే వారం రోజుల నుంచీ... అరవంలోనూ తెలుగులోనూ ఒకేసారి తీస్తున్నారు. రేపటితో పని పూర్తిచేసుకుని వెళ్లిపోవాలి.

సినిమాలో నీలాటి ఒక అమ్మాయి ఉంది. కుమారి ఆ అమ్మాయి పేరు. అచ్చం నీలాగే ఉంటుందిట. అయితే ఆ అమ్మాయి మద్రాసు నుంచి రాలేదు. జ్వరంట. అలా అని అక్కడివాళ్లు కబురు చేశారు. నువ్వు చెయ్యవలసిందల్లా ఏమిటంటే... జాగ్రత్తగా విను... భయపడకు... రేపు ఒక్కరోజు ఆ పిల్లబదులు నువ్వు నటించాలి.

నీకేమీ ఫరవాలేదు. నువ్వేమీ మాట్లాడనక్కరలేదు కూడా. ఏమీ కష్టం వుండదు. ఒక్కరోజు పని... డబ్బు ఇస్తారు..." బుజ్జమ్మ గుండె ఒక్కక్షణం ఆగింది. ముందు భయం. ఆ తర్వాత ఆశ్చర్యం... కళ్లు పెద్దవైనాయి.

నిప్పుకోడిగాడు ముందు మాట్లాడాడు. నిర్లక్ష్యంగా "అంతా మేం చూసుకుంటాంలెండి... మా బుజ్జమ్మ వొస్తది" అన్నాడు.

"ఊఁహూఁ నాకు భయం" అన్నది బుజ్జమ్మ.

"మేముంటాము నీకు తోడుగా" అన్నాడు ధైర్యం చెబుతున్నట్లు చింపిరిగాడు.

టీ.సీ.గారు ఆ ఇద్దరివంక తిరిగి "చిన్నపిల్ల... భయపడుతున్నది. నేను చెబుతాను. మీరు రేపు ఉదయమే మా ఇంటికి - క్వార్టర్సుకు - రండి" అన్నాడు. తర్వాత తమిళంలో ఏదో అని నవ్వాడు.

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

తర్వాత టీ.సీ.గారు ముగ్గురు మగవెధవలను ఉద్దేశించి - "ఒరే వెధవాయిల్లారా! జాగ్రత్తగా వినండి. వాళ్లు ఒక్క రోజు పనికి అయిదొందలుదాకా ఇస్తామన్నారు. ఈ పిల్ల ఏమీ బరువులు మోయనక్కరలేదు. కష్టపడనక్కరలేదు. వాళ్లు చెప్పినట్టు విని చెప్పినట్టు చెయ్యడమే. అయిదొందలంటే సామాన్యమా?

ఎన్ని రోజులు రైలు పెట్టెలు ఊడ్చి ఎందరిని అడుక్కుంటే అంత డబ్బు కళ్లజూస్తారు? రేపు ఉదయం వాళ్లను తీసుకొస్తాను. సిద్ధంగా ఉండండి లేదా మీ ఖర్మ..." అని వెళ్లిపోయాడు.

ఆ రాత్రి ఎవరికీ నిద్రలేదు. చాలాసేపు దగ్గర దగ్గరగా కూర్చుని మాట్లాడుకున్నారు. గుసగుసలు పోయారు. బుజ్జమ్మ ముందు తల అడ్డంగా ఊపింది. మాటిమాటికీ "నాకు భయంబాబూ" అన్నది.

చివరకు నిప్పుకోడిగాడు తన పెద్దరికం అంత వొలకబోస్తూ - "ఒసే ఎర్రి మొగమా! అందరూ సినిమాలో అని ఏడుస్తావుంటే నువ్వు వొద్దని ఏడుస్తావేమే. మేముంటాంగదా? ఊరికే బయపడి సావకు" అని ముగించాడు.

బుజ్జమ్మ అలిసిపోయి గోడకు జారగిలబడి నిద్రపోయింది. మిగిలిన ముగ్గురూ కాస్సేపు కబుర్లాడుకున్నారు. 'రేప్పొద్దున్న పినాకిని ప్రయాణం రద్దు' అనుకున్నారు. తాము కూడా బుజ్జమ్మ వెంటనే ఉంటామనీ, అందుకు వాళ్లు ఒప్పుకోకపోతే "కుదరద"ని చెప్పేద్దామనుకున్నారు.

నడిరాత్రి దాటింది. రైళ్ల రాకపోకలు తగ్గాయి. ప్లాట్‌ఫారాల మీద రద్దీకూడా తగ్గింది.

తెల్లవారుతుండగానే బుజ్జమ్మ లేచి ప్లాట్‌ఫారం చివరకు వెళ్లింది. పది నిముషాల తర్వాత తిరిగి వచ్చేసరికి ఇంకా ముగ్గురు గాడిదలూ మొద్దునిద్రపోతున్నారు. ఎదురుగా వెలుతురు వ్యాపిస్తున్నది.

ఏడు గంటలలోపే టీ.సీ.గారితో సహా ఆ ఇద్దరు వ్యక్తులూ వచ్చేశారు.

వస్తూనే హడావిడిగా "ఏం రెడియా?" అన్నారు.

ఈ కలకలంతో ముగ్గురు మగపిల్లలూ లేచారు.

"ఒక్క పావుగంటలో తయారు సార్" అన్నారు.

"మీరెక్కడికి?" అన్నాడు టీ.సీ.గారు.

"మేమూ వొస్తాం సార్" అన్నాడు నిప్పుకోడిగాడు.

"వాళ్లు రాకపోతే నేనూ రాను" అన్నది బుజ్జమ్మ.

అవతలివాళ్లు పెద్దగా పట్టించుకోలేదు.

"సరే" అన్నారు.

కాస్సేపటితర్వాత మురికిదుస్తులతో మగవెధవలూ, మాసిన చిరిగిన గౌనుతో బుజ్జమ్మా పెద్దకారులో అయిదారు మైళ్లు ప్రయాణంచేసి నగరశివార్లలో ఒక గ్రామం చివర ఒక పెంకుటింటి ముందు ఆగారు.

అక్కడ అంతా కోలాహలంగా ఉంది. అలజడిగా ఉంది. అందరూ వీళ్లకోసమే ఎదురుచూస్తున్నట్టున్నారు. ఖరీదైన సిగరెట్ ప్యాకెట్ చేతిలో పట్టుకుని నిర్మాతా, టోపీ పెట్టుకుని ఒక దర్శకుడు, ఇంకా ఇతరులూ బుజ్జమ్మను చూసి "అచ్చం కుమారిలాగే ఉంటుంది మేకప్‌లో" అని సంతృప్తి ప్రకటించారు.

బుజ్జమ్మను నేరుగా లోపలికి తోలుకుపోయారు. మేకప్ మాన్ ఆ పిల్ల ముఖాన్ని పట్టుకుని అటూ ఇటూ తిప్పి చూసి "ఆల్‌రైట్..." అన్నాడు. ఒక కుర్చీలో కూలేసి మేకప్ మొదలుపెట్టాడు. ఆ తర్వాత దుస్తులు కట్టబెట్టాడు.

ఒకాయన వచ్చి అనునయంగా "నువ్వు మేం చెప్పినట్టు నడుచుకో చాలు" అన్నాడు.

పక్కవారితో "కుమారి అయితే సుకుమారం. దీన్తో మనకా ఇబ్బంది లేదు. కావలసిన ఎఫెక్ట్ రాబట్టుకోవచ్చు" అన్నాడు.

తర్వాత అందరికీ టిఫిన్లు పెట్టారు. నిప్పుకోడిగాడు, చింపిరీ, కోటిగాడు బుజ్జమ్మను చూసి ఆశ్చర్యంతో ఆవులించారు. 'అబ్బ! రాజకుమారిలాగున్నది మన బుజ్జమ్మ' అనుకున్నారు.

ఆ తర్వాత షూటింగ్ మొదలయింది. అసలు హింస మొదలయింది. నలుగురు భయంకరాకారులు బుజ్జమ్మను ఎత్తుకుని ముందు ఆరుబయట రాళ్లూ రప్పల మధ్య పరుగులుపెట్టారు.

ఒకడు వాళ్లను వెంబడిస్తున్నాడు.

వాళ్లు బుజ్జమ్మను గాల్లోకి విసిరేశారు. క్రిందపడేశారు. మళ్లీ ఎత్తుకున్నారు. విలవిల్లాడుతున్న ఆ పిల్లతో వాలీబాలూ ఫుట్‌బాలూ ఆడుకున్నారు.

అదికాగానే బుజ్జమ్మ ఏడుస్తూ ఉంటే ఒకాయన వచ్చి అనునయించాడు. "ఇంకెంత... కాస్సేపే..." అన్నాడు ఓదారుస్తూ.

మళ్లీ మేకప్ సరిచేశారు. ఈలోపల మళ్లీ కేకలు వినిపించాయి. అంతా సిద్ధమైనారు. ఈసారి దూరంగా ఉంచిన పెట్టెలోనుంచి ఒక పెద్ద కొండచిలువను తీశారు. ఒకడు బుజ్జమ్మను గుంజకు కట్టేశాడు. తర్వాత ఆ కొండచిలువను తెచ్చి ఆ పిల్లగొంతు చుట్టూ, ఒంటి చుట్టూ చుట్టాడు.

బుజ్జమ్మ కేకలు పెట్టింది. భయంతో వొణికిపోతూ అరిచింది. "బాబోయ్, నాయనోయ్" అని బొబ్బలు పెట్టింది. నిప్పుకోడిగాడు, మిగిలిన ఇద్దరూ చూడలేక బైటికి పోయి నిర్విణ్ణులై నిలబడ్డారు. అందరూ "బాగుంది... బాగుంది... మంచి రిజల్టు వొస్తున్నది" అని ఆనందించారు.

కొద్ది నిముషాలపాటు ఆ గుహ అంతా బుజ్జమ్మ అరుపులతో కేకలతో హోరెత్తిపోయింది. అంతా షూట్‌చేసి 'బ్యూటీఫుల్' అనుకున్నారందరూ.

ఆ తర్వాత నిలువెల్లా వొణికిపోతున్న బుజ్జమ్మను మళ్లీ మళ్లీ బుజ్జగించారు. మళ్లీ ఒక దేవత పటం ముందు దణ్ణం పెట్టుకుంటూ ఏడుస్తున్న దృశ్యం చిత్రీకరించారు. 'ఏడవ'మన్నారు. వాళ్లలా అడగకముందే ఆ పిల్ల ఏడుపు మొదలుపెట్టింది.

మధ్యాహ్నం బుజ్జమ్మకీ, ముగ్గురు మగపిల్లలకి ఇతరులతోపాటు తిండి పెట్టారు.

నిర్మాత "అమ్మయ్య! అనుకున్న ప్రకారం పని పూర్తిచేశాం" అని సంతృప్తి ప్రకటించాడు.

నలుగురు పిల్లలూ "బ్రతుకుజీవుడా' అనుకుంటున్నట్టు దూరంగా చెట్టుకింద కూర్చున్నారు. బుజ్జమ్మ తన పాత గౌనుతో పాత అవతారంతో కూర్చుంది. మిగిలినవారందరూ ఇక తిరిగి ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.

ఒక వ్యక్తి – నిన్న బుజ్జమ్మను చూసినవాళ్లిద్దరిలో ఒకడు – నడిచి వచ్చి – "ఇదుగో డబ్బు. ప్రొడ్యూసర్‌గారు ఇమ్మన్నారు" అని ఒక నోటు అందించాడు బుజ్జమ్మకు. ఇచ్చి వెంటనే వెళ్ళిపోయాడు.

రంగురంగుల నోటు... సరికొత్త నోటు.

బుజ్జమ్మ దాన్ని ఆబగా అందుకుని కళ్లు పెద్దవి చేసుకుని చూసింది.

"ఐదొందలు నోటు" అన్నాడు నిప్పుకోడిగాడు.

బుజ్జమ్మ దాన్ని వాడికి అందించింది.

ముగ్గురూ అతి మృదువుగా నెమ్మదిగా దాన్ని అందుకుని చూశారు.

మరికాస్సేపటిలో ఒక క్రిక్కిరిసిన వ్యానులో వాళ్లను చాలా సామాన్లతోపాటు కుక్కి స్టేషను దగ్గరికి తెచ్చి వొదిలిపెట్టారు. వాళ్లు కిందికి దూకగానే వ్యాను రివ్వున వెళ్లిపోయింది.

సాయంకాలమైంది. ఎదురుగా ఆకాశం అంతా ఎర్రగా ఉంది. సూర్యుడు జ్వాలాగోళమై అస్తమిస్తున్నాడు. స్టేషనులో తమ మామూలు చోటుకు చేరారు

నలుగురూ. బుజ్జమ్మ ఎందుకో వెక్కి వెక్కి ఏడుస్తూనే నిద్రపోయింది. మిగిలిన ముగ్గురూ పక్కనే కూర్చుని అయిదువందల రూపాయల నోటు ముందుంచుకుని రంగు రంగుల కలలు కంటున్నారు.

టన్నులకొద్దీ అయిస్క్రీము, వందలకొద్దీ పచ్చిమిరపకాయ బజ్జీలు, లెక్కలేనన్ని గోల్డ్‌స్పాట్‌లు, కొన్ని రంగుల స్టంట్ సినిమాలు వాళ్ల కళ్ల ముందు తిరిగుతున్నాయి.

బుజ్జమ్మకు మాత్రం చాలా పొద్దుపోయాక ఒక రాత్రివేళ కల వచ్చింది. పెద్ద పాము తనమీద పాకుతున్నట్టు... కెవ్వుమని కేకపెట్టి లేచి అంతలోనే కుదుటపడి మరో పక్కకు తిరిగి పడుకుంది.

❀ ❀ ❀